క్లుప్తంగా

స్థల పరిశీలన



వర్ధన్నపేట : మండలంలోని కడారిగూడెం గ్రామంలో ఏర్పాటు చేయనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠ కోసం శనివారం జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, సర్పంచ్ మంద సతీష్ స్థల పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ.. త్వరలో ఎమ్మెల్యే రమేష్ ఆదేశాల మేరకు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంలో నాయకులు కంజర్ల ఎల్లయ్య, కుమారస్వామి, చెన్న రమేష్, ఎల్లయ్య, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి అంగన్‌వాడీ సెంటర్–1లో చిన్నారులకు శనివారం పౌష్టికాహారం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ ఉపేంద్ర మాట్లాడుతూ ప్రతి నెల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు తీసుకువచ్చి వారి బరువు, ఎత్తులను క్రమం తప్పకుండా పరీక్షించడం ద్వారా ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

ఉపాధి కల్పించాలి



వర్ధన్నపేట : దళితులకు వర్ధన్నపేట మున్సిపాలిటీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ శనివారం పట్టణ ఏడో వార్డు దళిత యువకులు కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కోనాపురం గ్రామానికి చెందిన దళిత యువకులు నిరుద్యోగులుగా ఉన్నారని వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న బృందం అధ్యక్షుడు ఆకుల మనోజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, నాయకుడు కొండేటి సత్యం పాల్గొన్నారు.

మిత్రుల చేయూత



ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన వడ్లకొండ రవి–సుజాత దంపతుల కుమార్తె మౌనిక వివాహానికి తోటివిద్యార్థులు శనివారం హాజరయ్యారు. మిత్రులంతా సేకరించుకున్న రూ.35,016లను అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వీరమనేని సాగర్‌రావు, ఎండి.అజహర్, అక్బర్, హైమద్ పాషా, కందుకూరి రాజు, బుర్ర భాస్కర్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

మంత్రి, ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు



వర్ధన్నపేట : వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పర్వతగిరి మండలంలో నిర్వహించిన పాదయాత్రలో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వర్ధన్నపేట జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అన్నారు. శనివారం వర్ధన్నపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు స్వామిరాయుడు, కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, పులి శ్రీను, తోటకూరి రాజమణి, ఆరెల్లి అంజన్‌రావు, సిలువేరు కుమారస్వామి, తుమ్మల రవీందర్, తుమ్మల యాకయ్య, ఆంగోతు బిక్షపతి, మార్త సారంగపాణి, రహీం తదితరులు పాల్గొన్నారు.

నివాళి



వర్ధన్నపేట : వర్ధన్నపేటకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండేటి సారంగపాణి (45) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, జక్కి శ్రీకాంత్ శనివారం సారంగపాణి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఈరెల్లి శ్రీనివాస్, కొండేటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో అన్యాయం



రాయపర్తి: అవగాహన కల్పిస్తున్న అధికారులు



పర్వతగిరి: నోడల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు



చెన్నారావుపేట: అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీ రవి



సంగెం: నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పర్వతగిరి : భాషాపండితులకు బదిలీలు, పదోన్నతులు కల్పించడంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్లతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ప్రమోషన్లు లేవని పండిత, పీఈటీ జేఏసీ ఐక్య వేదిక ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి తెలుగు, హిందీ ప్రశ్నాపత్రంపై శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పండిత, పీఈటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రమోషన్లలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపి డీసీఈబి సెక్రటరీ కృష్ణమూర్తి, నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎండి.జలీల్, పర్వతగిరి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వనం సదానందం, వల్లాజి నర్సింహస్వామి మాట్లాడుతూ 2017లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ప్రపంచ మహాసభలలో పండిట్లకు అప్‌గ్రేడేషన్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎం.నాగేశ్వర్‌రావు, మంద రవీందర్, ఆకుల అశోక్, వెంకటేశ్వర్లు, లత, రాధ, ఉష, సతీష్, ఖలీల్‌పాషా, సూరిబాబు, లింగమూర్తి, ఫరీద్, మజహర్ మోహినుద్దీన్, మడల భాస్కర్, వంశీ, మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన

రాయపర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పరీక్షా పేపర్ విధానంతో పాటు, వందశాతం సిలబస్, 10/10 జీపీఏ ఎక్కువ మార్కులు సాధించేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి, అసిస్టెంట్ సెక్రటరీ సీహెచ్ శ్రీధర్, జిల్లాస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్స్ అనురాధ, మహేశ్వర్, కుమారస్వామి, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది యాకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిరి పరీక్షలు నిర్వహించాలి

చెన్నారావుపేట : పదో తరగతి విద్యార్థులకు మాదిరి పరీక్షలు నిర్వహించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం రజిని, ఆర్‌పీ గుండు రవి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో హైస్కూల్‌లో ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు డీఈఓ, డీసీఈబీ ఆదేశాల మేరకు జిల్లా రిసోర్స్ పర్సన్‌లు తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్ట్‌లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు లఘు, వ్యాసరూప ప్రశ్నలు, పదజాలం, వ్యాకరణాంశాలు, స్టడీ స్కిల్స్, గ్రామర్, రీడింగ్, కాంపిటీషన్, వ్యక్తీకరణ, సృజనాత్మకతపై చర్చించారు. ఈ సదస్సులో భాషా పండితులు వారి పదోన్నతులు నిలిచిపోవడంతో నిరసన తెలిపారు. అవగాహన సదస్సులో అనుపమ కిషోర్, ఉపాధ్యాయులు కిషోర్, నిర్మలదేవి, కుమారస్వామి, వీరస్వామి, మురళి, తేజస్విని, హేమదేది, విజయ, లక్ష్మి, మమత, సునీత,రమణారావు, రవీందర్, శేఖర్, మంజుల, సరిత, జయశ్రీ, వీరబాబు, సహీమ, భాగ్యలక్ష్మి, సీఆర్‌పీ సంపత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

సంగెం : తెలుగు, హిందీ భాషోపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులలో ప్రభుత్వం అవకాశం కల్పించకపోవడంతో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రశ్నపత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా పండితులకు అప్‌గ్రేడేషన్ చేయకపోవడంతో నిరాశకు గురై నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాక్ అధ్యక్షుడు అడ్లూరి వెంకటేశ్వర్లు, భాషాపండితులు కరుణకుమార్, సంజీవ్‌కుమార్, జ్యోతిర్మయి, వెంకటేశ్వర్లు, స్వామి, రాజు, విజయ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డైట్'లో విద్యా సదస్సు

నెక్కొండ : నేడు(ఆదివారం) హనుమకొండలోని డైట్ కళాశాలలో నిర్వహించనున్న 'జాతీయ విద్యా విధానం–2020' విద్యా సదస్సును విజయవంతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.జాన్‌నాయక్ ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారా పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారన్నారు. విద్యలో వెనకబడిన విద్యార్థులకు వృత్తి విద్యలను నేర్పడం, ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పేదలకు అందని ద్రాక్షాల అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.బాలాజి, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : హనుమకొండలోని డైట్ కళాశాలలో నేడు (ఆదివారం) తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'జాతీయ విద్యా విధానం–2020' అనే అంశంపై నిర్వహించనున్న విద్యా సదస్సును జయప్రదం చేయాలని డీటీఎఫ్ మండల అధ్యక్షుడు తూముల రఘువీర్ ఒక ప్రకటనలో శనివారం కోరారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జి.హరగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఉపాధ్యాయులు, విద్యా అభిమానులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సంగెం : మండలంలోని షాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీపీ కళావతి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సట్ల రాజు, మాజీ సర్పంచ్ పేరాల రాజు, నాయకులు రమేష్, చిరంజీవి, విజేందర్ పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం భక్తిశ్రద్ధలతో గరుడ హోమం, తిరుచ్చి వాహనసేవ, ధ్వజారోహణం, గరుడముద్దలు, నిత్యహోమం, బలిహరణం, ఎదుర్కొళ్ల ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానార్చకులు ఆరుట్ల రంగాచార్యులు, రమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్సంపేట: పరామర్శిస్తున్న నాయకులు

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట, రంగాపురం గ్రామాల్లో బాధిత కుటుంబాలను ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ శనివారం పరామర్శించారు. ధర్మారావుపేటకు చెందిన మేడిద నర్సమ్మ, రంగాపురం గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్ను పూర్ణచందర్, కుమారస్వామి, తిరుపతి, దాసరి రమేష్, పులిగిల్ల యాదగిరి, బందారపు శ్రీనివాస్, కత్తాల వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : పట్టణంలోని 1వ వార్డుకు చెందిన రిక్షా యూనియన్ అధ్యక్షుడు భూషబోయిన లక్ష్మయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా శనివారం లక్ష్మయ్య దశదిన కార్యక్రమానికి గుంటి రజని, దేవోజు తిరుమల, మినుముల రాజు, కౌన్సిలర్లు హాజరై బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ రిక్షా యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట : పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని మొక్కజొన్న పంటపై గడ్డిమందు పిచికారీ చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన నాగనబోయిన కైలాసానికి చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటలో గీసుకొండ మండలం శాయంపేటకు చెందిన గాదె శ్రీకాంత్, దూడయ్యలు గడ్డిమందు పిచికారీ చేశారని తెలిపారు. బాధితుడు కైలాసం ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అంజిరెడ్డి, వేణు

చెన్నారావుపేట : చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పాఠశాల ప్రథమ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, నేషనల్ అవార్డు గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయుడు వేణు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూరాబా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల వదిలి ఉన్నత చదువుల కోసం వెళ్తున్న విద్యార్థినులు స్టడీని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. పదోతరగతి విద్యార్థినులకు మాజీ ప్రిన్సిపాల్ అంజిరెడ్డి స్టడీ మెటీరియల్‌ను అందించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిని మెట్టుపల్లి జ్యోతి, ఉపాధ్యాయులు సబిత, రాజ్యలక్ష్మి, సరస్వతి, సంధ్య, మంజుల, తేజస్విని, షాహీనా, కమలమ్మ, సుమలత, స్వప్న, రజిత, మౌనిక, దేవిక, అనిత, మౌనిక, నాగరాణి, స్వరూప, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

నర్సంపేట రూరల్ : ప్రభుత్వం అందించే సదుపాయాలన్నీ వినియోగించుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని జిల్లా సెక్టోరియల్ అధికారి ఓడపెల్లి సుధీర్‌బాబు అన్నారు. నర్సంపేటలోని మహేశ్వరంలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను శనివారం పంపిణీ చేశారు. అనంతరం తరగతి గదులను, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలో లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మహమ్మద్ ఇషాక్ అలీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

నల్లబెల్లి : నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న స్వామిని సస్పెన్షన్ చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం శనివారం తెలిపారు. పోలీస్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్‌పై శాఖపరమైన అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు విచారించిన సీపీ సస్పెన్షన్ వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.


'అభివృద్ధిని అడ్డుకోకండి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నర్సంపేట : ఎమ్మెల్యే చేపట్టిన అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకోవద్దని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటిల బుద్ధితోనే ఆత్మగౌరవ భవన నిర్మాణాలు ఆలస్యం అయ్యాయన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ మోతె కళావతిపద్మనాభరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గుంటి కిషన్, దార్ల రమాదేవి, బాల్నె సర్వేశం, రుద్ర ఓంప్రకాశ్, నామాల సత్యనారాయణ, మండల శ్రీనివాస్, డాక్టర్ ఉదయ్‌సింగ్, సాంబయ్యగౌడ్, కుమార్‌గౌడ్, వేల్పుల సాంబయ్య, నాగిశెట్టి ప్రసాద్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, వివిధ కుల సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'భూమిలో గుడిసెలు వేసి బెదిరిస్తున్నారు'



గీసుకొండ : సీపీఐ నాయకులు, మరికొందరు అక్రమంగా తమ సొంత భూమిలో గుడిసెలు వేసి ఆక్రమించుకున్నారని, ఇదేంటని అడిగితే తిరగబడి దౌర్జన్యం చేస్తున్నారని బాధితులు శనివారం తహసీల్దార్ విశ్వనారాయణ, ఇన్‌స్పెక్టర్ సట్ల రాజుకు ఫిర్యాదు చేశారు. గొర్రెకుంట శివారులోని 575/ఏ సర్వే నెంబర్‌లో సుమారు పది మంది 1,793 గజాల భూమిని కొనుగోలు చేసి 2008లో రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. తాజాగా సీపీఐ నాయకులు మేకల రవి, భద్రయ్య, మరి కొందరు గుడిసెలు వేసి ఆక్రమించుకున్నారని తెలిపారు. తమ భూమిని తమకు ఇప్పించాలని, గుడిసెలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కొండవీటి రాజు, రాజారెడ్డి, ఉప్పుల రాజు, సారయ్య, చిన్నాల హరికృష్ణ, జ్ఞాన్‌రెడ్డి, సుందరమ్మ, కొల్పుల కట్టయ్య ఫిర్యాదులో కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నియామక పత్రం అందిస్తున్న గోపాల్‌నాయక్

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ సూచించారు. ఈ మేరకు మండలంలోని బోజేర్వు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యక్షుడిగా రాదారపు భిక్షపతి, ఉపాధ్యక్షులుగా షాగంటి మహేందర్, ప్రధాన కార్యదర్శిగా బండెబోయిన రాజు, కార్యదర్శిగా నూకల సారయ్య, కోశాధికారిగా మీరాల నర్సయ్య, సభ్యులుగా దూడయ్య, మారయ్య, చిన్న వెంకన్న, నూకల రవి, బండి సంపత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బిళ్ల ఇంద్రసేనారెడ్డి, ఉప సర్పంచ్ కుసుమ సతీష్, పైరాల ఐలయ్య, నూకల సాంబరాజు, శ్రీ శైలం, బండి ఆగయ్య, రమేష్, మల్లయ్య, కట్టయ్య, సంపత్, రవి, రాజులపాటి, రాజు, నాగరాజు, రాజు, తదితరులు ఉన్నారు.

ఆహార అలవాట్లతో క్యాన్సర్ దూరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

నర్సంపేట : ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లతో క్యాన్సర్ దూరమవుతోందని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10లక్షల మందికి పైగా క్యాన్సర్ తో మృతి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజేష్, అధ్యాపకులు మెరుగు శ్రీధర్, రాజేష్, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్యాలు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

నర్సంపేట : నర్సంపేట డివిజన్ రైస్‌మిల్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న యాజమాన్యాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి(ఏఐఎఫ్‌టీయూ(న్యూ) అనుబంధం) గిన్నారపు కుమారస్వామి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలోని అంగడి సెంటర్‌లో శనివారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యతతో ఎన్ని సమస్యలు ఎదురైనా వేతనాల పెంపును విజయవంతం చేసుకోవాల్సిన బాధ్యత కార్మికులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మిల్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ అధ్యక్షులు తాళ్ల చంద్రశేఖర్, కోశాధికారి దిడ్డి బుచ్చి రాములు, ఉపాధ్యక్షుడు మేడిపల్లి కిరణ్, గురజాల వెంకటరెడ్డి, ముఖ్య సలహాదారులు పోశాల కోటేశ్వర్, పెరుమాండ్ల నర్సయ్య, సహాయ కార్యదర్శులు నల్ల శ్రీను, గంధం శరత్‌బాబు, దూలం సాంబయ్య, కార్యవర్గ సభ్యులు అనుముల సురేందర్, కాటిపాక యాకయ్య, మండల స్వామి, కంచర్ల సమ్మయ్య, భువనగిరి సురేష్, సముద్రాల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచిత విద్యుత్ అందించాలి



నర్సంపేట: అంబేడ్కర్ సెంటర్‌లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా నాయకుడు గట్టి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెబుతున్న కేసీఆర్ పాలనలో పంటలు ఎండి పోతున్నాయన్నారు. కరెంటు కోతలు, లో ఓల్టేజీతో నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన స్పందించడం లేదని విమర్శించారు. ఏజెన్సీ రైతులపై విద్యుత్ అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడాలని, తక్షణమే కరెంటు కోతలను నివారించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుర్రం అజయ్, ఆకుల వెంకటస్వామి, దనసరి సురేష్, సుమన్, భోగి సారంగపాణి, కుమార్, సాంబన్న, రవి, రాజేష్, మల్లన్న పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నివారించాలి

నల్లబెల్లి : విద్యుత్ కోతలను నివారించి, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని బీజేవైఎం నాయకుడు సూదగాని ప్రమోద్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని విమర్శించాడు.

బడ్జెట్‌లో పోస్టల్‌కు భారీ నజరానా



మాట్లాడుతున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేష్

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తపాలా శాఖకు పెద్దపీట వేయడమే కాకుండా అనేక ప్రోత్సాహకాలను ప్రకటించిందని నర్సంపేట పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఇప్పటికే అనేక పథకాల వడ్డీ రేట్లను భారీగా పెంచిన కేంద్ర ప్రభుత్వం తాజాగా పూలు స్కీములలో డిపాజిట్ పరిమితులను భారీగా పెంచిందన్నారు. సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్ గరిష్ట పరిమితి రూ.15లక్షల నుంచి రూ.30లక్షలకు పెంపుదల చేస్తూ వడ్డీ శాతం 8శాతంగా ఉంచారని, నెల వారి ఇన్‌కమ్ స్కీమ్(ఎంఐఎస్)లో సింగల్ ఖాతాకు అత్యధిక పరిమితి రూ.4.50లక్షల నుంచి రూ.9లక్షల వరకు, జాయింట్‌ఖాతాకు రూ.9లక్షల నుంచి రూ.15లక్షల వరకు పెంచడంతో పాటు వడ్డీ రేటును 6.7శాతంగా నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే ఆడ పిల్లల భవిష్యత్ కోసం సుకన్య సమృద్ధి ఉండగా, మహిళలు, ఆడ పిల్లల కోసం మరో కొత్త పథకం మహిళా బచత్ సమ్మాన్ యోజన పథకం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ కొత్త పథకంలో అత్యధికంగా రూ.2లక్షల వరకు జమ చేసుకోవచ్చని, దీని కాల పరిమితి రెండు సంవత్సరాలు, వడ్డీ రేటు 7.5శాతంగా నిర్ణయించిందని, మధ్యలో అవసరము ఉంటే కొంత వరకు నగదును తీసుకునే సదుపాయం కూడా ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని, ఆర్థిక లావాదేవీలను పరిపుష్టంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పోస్ట్ మాస్టర్ దార్ల రాజేందర్, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.